# జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠి ఛార్జ్ చేయడం దారుణం

- **బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్**

**పొన్న జులై 22(డిడి9 వార్త న్యూస్ ):**





ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, అనంతరం నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ధర్నా నిర్వహించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో మెరుపు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన అనంతరం బీజేపీ ఎంపీ గెడం.నగేష్ క్యాంప్ కార్యాలయన్ని కాంగ్రెస్ నాయకులు ముట్టడించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే. గజేందర్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆడే. గజేందర్ మాట్లాడుతూ,శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థుల పక్షాన నిలిచిన రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ యువతకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థులు యువత హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని ఆడే గజేందర్ స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యార్థి ఎన్నికల జోష్..!

- **విద్యాలయ పాఠశాలలో విద్యార్థుల మాక్ పోలింగ్**
- **సీఐ నరేష్ కుమార్**

**డి డి 9 ఇచ్చోడా**



ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక విద్యాలయ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన మాక్ పోలింగ్ అచ్చం ఎన్నికల వలె జరిగిందని సీఐ నరేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ.. తరగతిగది, పాఠశాలకు ఒక విద్యార్థి హెడ్ గా వ్యవహరించే స్థాయిని ఎన్నికలు నిర్వహించి నియమించడం జరిగింది. ఈ మేరకు తరగతి గదికి ఇద్దరు చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసి ఎన్నికల్లో నిలబడడం జరుగుతుంది. వారి ఇద్దరి మధ్యలో పోటీ తత్వాన్ని నిలిపి విద్యార్థులు తమ తరగతి గదికి నచ్చిన అభ్యర్థిని ఎన్నుకొని తమ బ్యాలెట్ పత్రాలతో ఓటు హక్కును విద్యార్థులకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకొని తమ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుకున్నారు. ఇలా ప్రతి తరగతి గదికి హెడ్ ని ఎన్నుకోవడం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ మార లయ శ్యామ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ పర్యవేక్షణలో ఉపాధ్యాయుల దిశా నిర్దేశంతో ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి.






# విధుల్లో మానవత్వం చాటిన పోలీసులు

- **రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో రక్షించి ఆసుపత్రికి తరలింపు**
- **ఎన్టీపీసీ క్రషర్‌నగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 22 (డీడీ9 వార్త):**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు విధి నిర్వహణలో మానవత్వాన్ని చాటుతూ రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందించి ప్రాణాలను కాపాడారు.

గోదావరిఖని ఎన్టీపీసీ క్రషర్‌నగర్ రాజీవ్ రహదారిపై గోదావరిఖని వైపు వెళ్తున్న ఓ లారీ టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపై నిలిచిపోయింది. అదే సమయంలో ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో వ్యాన్ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు.

నైట్ పెట్రోలింగ్‌లో ఉన్న గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డితో పాటు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి, గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్యం అందేలా చర్యలు చేపట్టారు.

అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు చూపిన మానవీయ స్పందనను స్థానిక ప్రజలు అభినందిస్తూ, ప్రజా భద్రతతో పాటు ప్రాణరక్షణలోనూ పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు.






# అంతా మా ఇష్టం.... అంటూ కాంట్రాక్టర్ జులుం

- **ఎవరేమన్నా... ఏం రాసుకున్నా... నాకేం పర్వాలేదు.**
- **వర్షంలోనే సీసీ రోడ్డు పనులు.. రూ.1.70 కోట్ల పనుల్లో నాణ్యతపై తీవ్ర అనుమానాలు**

**బాన్సువాడ, జూలై 22 (డీడీ9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో బైపాస్ రోడ్డుకు రూ.1.70 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు తీవ్ర వివాదానికి దారితీస్తున్నాయి. ప్రజాధనంతో చేపడుతున్న ఈ భారీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షం కురుస్తున్న సమయంలోనే కాంక్రీట్ పనులు ప్రారంభించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించిన ఈ పనుల్లో కాంట్రాక్టర్ మొదట గ్రావెల్ వేసి నెలల తరబడి పనులను నిలిపివేశారు. దీంతో గ్రావెల్ దెబ్బతిన్నా, ఎలాంటి సరిదిద్దే చర్యలు తీసుకోకుండా నేరుగా సీసీ పనులు ప్రారంభించడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు.అయితే, వర్షం పడుతున్న సమయంలోనే స్థానిక సర్పంచ్ చేతుల మీదుగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా వర్షంలో కాంక్రీట్ పనులు చేపట్టడం వల్ల నాణ్యత దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్న నేపథ్యంలో, ఇక్కడ మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ఎవరేమన్నా... ఏం రాసుకున్నా... నాకేం పర్వాలేదు అనే ధోరణితో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నాడని, అధికారుల పర్యవేక్షణ కూడా కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో జరుగుతున్న పనుల్లో ఇలాంటి నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.గ్రామస్థులు వెంటనే జిల్లా కలెక్టర్, నాణ్యత నియంత్రణ విభాగం అధికారులు జోక్యం చేసుకుని పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు ఉల్లంఘించినట్లు తేలితే కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బిల్లులు నిలిపివేయాలని కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై పంచాయతీ రాజ్ ఏఈని వివరణ కోరగా, సీసీ రోడ్డు పనులన్నీ నా పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి అని ఆయన తెలిపారు. అయితే గ్రామస్థులు చేస్తున్న ఆరోపణలపై మాత్రం ఆయన ప్రత్యేకంగా స్పందించలేదు.



# ప్రభుత్వాసుపత్రికి వెంటిలేటర్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు వినతిపత్రం.. అత్యవసర వైద్య సేవల బలోపేతంపై విజ్ఞప్తి**
- **రాత్రి వేళల్లో సీనియర్ వైద్యులను అందుబాటులో ఉంచాలని వినతి**
- **సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 22 (డీడీ9 వార్త):**

ప్రభుత్వాసుపత్రిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్‌కు వినతిపత్రం సమర్పించారు.

వినతిపత్రంలో ప్రధానంగా ప్రభుత్వాసుపత్రికి వెంటిలేటర్ సౌకర్యం కలిగిన అంబులెన్స్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న క్రిటికల్ రోగులను ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించే సమయంలో వెంటిలేటర్ అంబులెన్స్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తోందని, ఒక్కోసారి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చార్జీలు వసూలు చేయడం వల్ల పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

అదేవిధంగా రాత్రి సమయంలో అత్యవసర విభాగంలో శిక్షణలో ఉన్న వైద్యులతో పాటు ఒక సీనియర్ వైద్యుడిని కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో సీరేంజ్ స్టాండ్లు వంటి మౌలిక వైద్య పరికరాల కొరతను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.




# చలో సంసద్‌పై లాఠీచార్జ్ ప్రజాస్వామ్యానికి విఘాతం

- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: కట్కూరి సందీప్**
- **ఢిల్లీలో నిరసన తెలిపిన యువతపై లాఠీచార్జ్‌ను ఖండించిన కట్కూరి సందీప్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 22 (డీడీ9 వార్త):**



ఢిల్లీలో నిర్వహించిన "చలో సంసద్" నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జ్ జరగడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన కట్కూరి సందీప్ విమర్శించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన కేంద్ర ప్రభుత్వ తీరును ఖండించారు.

శాంతియుతంగా నిరసన చేపట్టిన యువతపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల గొంతును అణచివేయడానికి పోలీసు వ్యవస్థను వినియోగించడం సరికాదని అన్నారు.

నీట్ పరీక్ష వ్యవహారంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, దీనిపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

అదేవిధంగా, దేశంలో విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాక్రోచ్ జనతా పార్టీ చేపడుతున్న ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కట్కూరి సందీప్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్యబద్ధమైన ప్రతి ఉద్యమానికి తెలంగాణ నుంచి తమ మద్దతు కొనసాగుతుందని పేర్కొన్నారు.

# పద్మావతి కాలనీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి

- **సమస్యను వివరించిన కార్పొరేటర్ సాగి సంతోష్ కుమార్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 22 (డీడీ9 వార్త):**




పద్మావతి కాలనీలో అత్యంత అవసరమైన రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ కుమార్ రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సాగర్ అపార్ట్‌మెంట్ పక్కనుంచి ఉంజిల్ నర్సింహయ్య గారి ఇంటి వరకు రహదారి నిర్మాణం అత్యవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

వినతిపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు కార్పొరేటర్ సాగి సంతోష్ కుమార్ తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తయితే కాలనీవాసులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

# కొత్త పెన్షన్ల మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- **హామీలు వెంటనే అమలు చేయాలి.. లేకపోతే భారీ ఆందోళనలు: బీజేపీ నాయకుడు మొలుమూరి శ్రీనివాస్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 22 (డీడీ9 వార్త):**



రాష్ట్రంలో కొత్త పెన్షన్ల మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ పెద్దపల్లి ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

బుధవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..., కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

అలాగే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4,000కు, వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పెన్షన్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలతో కలిసి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మొలుమూరి శ్రీనివాస్ హెచ్చరించారు.